క్లుప్తంగా

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

తిమ్మాపూర్ పాఠశాల తనిఖీ



తిమ్మాపూర్ పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా చతుర్విధ ప్రక్రియలు చదవడం, రాయడం, గుణితాలు రావాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. మంచి అలవాట్లను నేర్పించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడులు చేస్తే ప్రతి దాడులకు సిద్ధం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎమ్మెల్యే సునీతారెడ్డి సమావేశాల్లో నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి కావాలనే గొడవలు చేస్తున్నారని మాజీ ఎంపీపీ హరికృష్ణ విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి సునీతారెడ్డిని ఎన్నుకున్న విషయం కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు కావాలనే గొడవలు చేస్తూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగరావు, నారాయణరావు, లక్ష్మీనర్సయ్య, అశోక్, లింగం పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం

రేగోడ్(మెదక్): మండలంలోని గజ్వాడ గ్రామంలో 1108 మంది రైతులకు గాను, 1107 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ 1కోటి 23 లక్షలు రైతు భరోసా పెట్టుబడి సాయం జమ అయినట్లు ఏఓ జావిద్ మంగళవారం చెప్పారు. అదే విధంగా 272 ఇందిరమ్మ గృహాలు, 179 రేషన్ కార్డులు, ఎనిమిది మంది కూలీలను ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారు. పైలట్ గ్రామంగా గజ్వాడ ఎంపికకు కృషి చేసిన మంత్రి దామోదర రాజనర్సింహా, పీసీసీ సభ్యుడు కిషన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా మిగతా 17 గ్రామ పంచాయతీల్లో కూడా పథకాలను వెంటనే అమలు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



టేక్మాల్ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు రమేష్, నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి బీరప్ప కామరాతి జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ మెదక్ జిల్లా మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్ల కురుమలు వారం రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 07 వరకు జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవానికి ఫిబ్రవరి 03న మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్ హాజరు కానున్నన్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఇందులో పీఏసీఎస్ డైరెక్టర్ పాపయ్య, నాయకులు భరత్ భూషణ్, అవినాష్, కాంతం, మల్లేశం తదితరులు ఉన్నారు.

214 మందికి రైతుభరోసా

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామానికి చెందిన 214మంది రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు జమ అయ్యాయని ఏఓ స్వప్న మంగళవారం తెలిపారు. ప్రభుత్వం మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగా అధికారులు, ప్రజాప్రతినిధులు మంజూరు పత్రాలను అందజేశారు. కాగా రైతు భరోసా ద్వారా 214 మంది రైతులకు 277 ఎకరాలకు సంబంధించి రూ. 16.61లక్షలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు.

నిర్మించారు.. వదిలేశారు

- వృథాగా ఈజీఎస్ కార్యాలయం
- చెత్త కుప్పల్లా గదులు



నిరుపయోగంగా ఉన్న గదుల దుస్థితి



చెత్తతో నిండిపోయిన గది

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన భవనం పూర్తిస్థాయిలో ఉపయోగంలో లేకపోవడంతో పై అంతస్తు నిరుపయోగంగా ఉంది. 15 ఏళ్ల క్రితం రూ.25 లక్షల నిధులతో ఐకేపీ, జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయాల వినియోగం కోసం నిర్మించి ప్రారంభించారు. కింది అంతస్తులో ఐకేపీ కార్యాలయం కొనసాగుతోంది. పై అంతస్తులో మాత్రం ఈజీఎస్ కోసం కేటాయించిన కార్యాలయం వృథాగా ఉంది. ప్రస్తుతం ఈజీఎస్ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతుండడంతో ఇక్కడ నిర్మించిన గదులు చెత్త కుప్పల్లా మారాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి భవనంలోని పై అంతస్తు ఇతర కార్యాలయాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలి.

విద్యకు మించిన ఆయుధం లేదు

- మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి
- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర్



అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్

నర్సాపూర్ రూరల్: విద్యకు మించిన ఆయుధం లేదని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ సాయిరాం విద్యార్థులకు సూచించారు. మంగళవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై మెదక్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్‌లో ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, ధూమపానం, మద్యపానం వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టి వేస్తుందన్నారు. యువతపై వాటికి బానిసలు కాకుండా చదువుపై దృష్టి పెట్టి, ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. గ్రామస్థాయిలో చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు రావడం విచారకరమన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లను ఎప్పటికప్పుడు పసిగట్టి వారిని తీర్చిదిద్దాలని తెలిపారు. మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురేశ్ కుమార్, అధ్యాపకులు రుక్మిణి, అనిత, పోలీసులు పాల్గొన్నారు.

సర్వే పనులను అడ్డుకున్న రైతులు



అధికారులతో బాధిత రైతుల వాగ్వాదం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 765 డీజీ బైపాస్ రోడ్డు సర్వే పనులను మంగళవారం భూములు కోల్పోతున్న రైతులు అడ్డుకున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం వద్దని కొంత కాలంగా రామాయంపేటలో నిరసన వ్యక్తం అవుతుంది. ఈ క్రమంలో జాతీయ రహదారిశాఖ అధికారులు సర్వే కోసం రాగా బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూముల్లో నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని అంగీకరించమని వారు పట్టుపట్టారు. అధికారులు సముదాయించినా బాధిత రైతులు వినకపోవడంతో వారు వెనుదిరిగారు.

గట్టి తనంలో మేటి.. భారతిసిమెంట్

మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్



మేస్త్రీలకు బహుమతులు అందిస్తున్న మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్

మెదక్‌జోన్: జర్మనీ టెక్నాలజీతో తయారు చేసిన భారతి సిమెంట్ గట్టితనంలో దానికి సాటి మరోటి లేదని ఆ సంస్థ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ శతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో పలువురు భవన నిర్మాణ మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీ సిమెంట్ రోబో లేబరేటరీ, జర్మనీ టెక్నాలజితో తయారు చేశారని, గట్టితనం, దృఢత్వంలో భారతిసిమెంట్‌కు సాటిలేదన్నారు. అనంతరం మేస్త్రీలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ సిబ్బంది శ్రీకాంత్, డీలర్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



నర్సాపూర్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: యువజన కాంగ్రెస్ నాయకులు మంగళవారం పట్టణంలోని చౌరస్తాలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ.. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై మంత్రి బండిసంజయ్ అనుచిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు.

తూప్రాన్: గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రేగోడ్(మెదక్): కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని వెంటనే క్షమపాణ చెప్పాలని దళిత సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దేవరాజ్ డిమాండ్ చేశారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు దారుణం

వెల్దుర్తి(తూప్రాన్): పద్మ అవార్డుల విషయంలో గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు దారుణమని పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు అన్నారు.

నేటి నుంచి సాఫ్ట్‌బాల్ పోటీలు

తూప్రాన్: పట్టణంలో బుధవారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో 14 ఏళ్ల లోపు బాల బాలికల రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకుంటామన్నారు. క్రీడాకారులకు వసతి, భోజనాలు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తు చేసుకునేందుకు పాట్లు

నిజాంపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కానీ విద్యార్థులకు పరీక్ష కేంద్రాలు ఎన్నుకోవడంలో పాఠశాలలు చూసుకునే ఆప్షన్ ఓపెన్ అవ్వకపోవడంతో దరఖాస్తు పూర్తి చేయడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 1న చివరి తేదీ కావడంతో విద్యార్థులు అయోమయం అవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రవేశ పరీక్షకు కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్థికంగా ఎదగాలి

మెప్మా పీడీ ఇందిర



మాట్లాడుతున్న మెప్మా పీడీ ఇందిర

మెదక్ కలెక్టరేట్: ఇందిరా మహిళ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లకు మెప్మా పీడీ ఇందిర సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని మెదక్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, జిల్లా రిసోర్స్ పర్సన్‌లతో బ్యాంకు లింకేజీ, లక్ష్యాలు, సాధించిన ప్రగతి సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద మంజూరైన యూనిట్లను బలోపేతం చేసి, వాటికి మార్కెటింగ్ చేయడం, కొత్త సంఘాల ఏర్పాటుకై ప్రణాళికలు సిద్ధం చేసుకొని, ఈ ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాలన్నారు. ప్రధాన మంత్రి స్వానిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు, సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు దేవపాల, ఆసియా, జిల్లా ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని వారిని సస్పెండ్ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిపై ప్రొటోకాల్ పాటించని అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సునీతారెడ్డిని కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి ఆహ్వానించిన గంట సమయంలో కార్యక్రమాన్ని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. తమ పార్టీ అధికారంలో లేకపోతే ఎమ్మెల్యేపై ప్రొటోకాల్ పాటించరా అంటూ తహసీల్దార్ ముసాద్దీక్‌ను ప్రశ్నించారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో కార్యక్రమాన్ని రద్దు చేశామని, త్వరలోనే రాష్ట్ర మంత్రితో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయిస్తామన్నారు. ఏ మంత్రి పంపిణీ చేసినా, హామీ ప్రకారం చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తేనే కార్యక్రమం జరగనిస్తామని, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీ విఠల్, గోపాల్‌రెడ్డి, పోచయ్య, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వభూమిలో ప్లాట్స్ విక్రయం

హద్దురాళ్లను తొలగించి బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు



శిఖం భూమిలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించగా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గుర్తించి హద్దురాళ్లను తొలగించిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ రాజు, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ శిఖం భూమిలో బోర్డులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఐబీ బంగ్లాకు ఎదురుగా ఉన్న కొత్తకుంట సర్వేనంబర్ 363లో 13ఎకరాల శిఖం భూమి ఉంది. ఈ భూమి ప్రభుత్వ ఆస్పత్రిని ఆనుకొని మోడల్ స్కూల్ వెనకభాగం నుంచి కొత్తకుంట వరకు ఉండగా కొందరు వ్యక్తులు ఈ భూమి తమదేనని ప్లాట్లుగా విభజించి విక్రయాలు కూడా చేశారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సర్వే నిర్వహించి, శిఖం భూమి హద్దులను నిర్ణయించారు. ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించి ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూమిలో అక్రమంగా ప్రవేశించినా.. నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



నిజాంపేటలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): ఈ మధ్య కాలంలో ఎక్కువగా ఆన్‌లైన్ మోసాలకు బలై తమ డబ్బులను, ప్రాణాలను కోల్పోతున్నారని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎవరైనా బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు నంబర్లు, ఆధార్ నంబరు, ఇతర వివరాలు అడిగితే ఎవరికి చెప్పొద్దన్నారు. అలాగే చాలా మంది యువత లోన్‌ఆప్ ద్వారా డబ్బులు తీసుకొని వారి వేధింపులు తాళలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని లోన్ ఆప్‌లను ఎవరు నమ్మొద్దన్నారు. అలాగే వాహనాలు నడిపే ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ముస్తాబైన ఆలయం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పోచమ్మ ఆలయం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 30న గణపతి పూజ, పుణ్యాహచనం, వరుణ పూజ, అఖండ దీపారాధన, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, 31 శుక్రవారం యంత్ర ప్రతిష్ఠాపన, అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన, అన్నదానం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ముస్తాబైన చాముండేశ్వరీ ఆలయం

- ఆలయానికి దగ్గరలో ప్రవహిస్తున్న మంజీరా
- 20 వేలకు పైగా భక్తులు రానున్నట్లు అంచనా



ముస్తాబైన చాముండేశ్వరీ ఆలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మాఘ అమవాస్యను పురస్కరించుకొని భక్తుల దర్శనార్థం చాముండేశ్వరీ ఆలయం ముస్తాబైంది. మంగళవారం ఈ సందర్భంగా చాముండేశ్వరీ ఆలయ సమితి, శాక్త మండల్ సభ్యులు మాట్లాడుతూ.. చాముండేశ్వరి ఆలయం పక్కనే మంజీర నది ఉండడంతో ఎప్పటిలాగే మాఘ అమావాస్యకు కూడా రూ. 20 వేల మంది భక్తులు మంజీర నదిలో స్నానాలకు వస్తారని అంచనా వేశారు. చిట్కుల్ శివారులో వెలసిన అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందుగానే అమ్మవారి ఆలయంలో సాధారణంగా కాకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామని, భక్తులు ఓపికగా అమ్మవారి దర్శనం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మంజీర నదిలో స్నానాల సమయంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అమ్మవారి ఆవరణలో మెదక్-జోగిపేట ఒక్కటే ప్రధాన రహదారి ఉండటంతో ట్రాఫిక్‌కు ఆవాంతరాలు రాకుండా భక్తులు సహకరించాలన్నారు. కాగా ఆలయ ఆవరణ ఏర్పాట్లను ఎస్ఐ నర్సింలు, పోలీసులు పరిశీలించారు.

మాఘ అమావాస్యకు ఏర్పాట్లు పూర్తి

పెద్దశంకరంపేట(మెదక్): మాఘ అమావాస్య సందర్భంగా మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆలయ కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా కోనేటిని శుభ్రపర్చడంతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కొల్చారం(నర్సాపూర్): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి అత్యవసర సాయం కింద ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తుందని నర్సాపూర్ నియోజకవర్గ టీపీసీసీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్దన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శేఖర్, వెంకట్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, వెంకట్ గౌడ్, మల్లేశం, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

◆ క్షీరాభిషేకం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం కొత్తగా అమలుచేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలతో లబ్ధిపొందనున్న మండలంలోని ధర్మారం గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు.

◆ క్రీడాకారులను ప్రోత్సహించాలి



పాపన్నపేట(మెదక్): నైపుణ్యం కలిగిన క్రీడాకారులకు ప్రోత్సహించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం పాపన్నపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉంటారని చెప్పారు. వారిని వెన్ను తట్టి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, టీచర్లపై ఉందన్నారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఆసిఫ్, నిఖిల్, రాకేష్, పవన్, మేఘరాజ్, సిద్ధిరాములు, వికాస్, ప్రకాష్, లోకేష్, నరేందర్, సాయి నిహాల్, చంటి, వెంకటేష్, శివకుమార్, సుమిత్ర, అశ్వినితో పాటు మొత్తం 36 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమానికి నరేందర్‌గౌడ్, సాయినాథ్ రావు దాతలుగా వ్యవహరించారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం మహేశ్వర్, పీడీలు పాల్గొన్నారు.

◆ లక్ష దప్పుల సభకు తరలిరండి

శివ్వంపేట(నర్సాపూర్): ఫిబ్రవరి 7న హైదరాబాదులో తలపెట్టిన లక్ష దప్పులు వేల గొంతుకల సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కళామండలి ఉపాధ్యక్షుడు బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో కళాకారుల బృందంతో దప్పు ప్రదర్శన నిర్వహించారు. మాదిగ ఉప కులాల ఐకమత్యం చాటేందుకు నిర్వహిస్తున్న సభకు మాదిగ ఉప కులాలు భారీ సంఖ్యలో హాజరుకావాలన్నారు.

◆ దేవాలయానికి సౌండ్‌సిస్టం అందజేత



టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో గొల్లకురుమల ఆరాధ్యదైవం బీరప్ప స్వామి దేవాలయానికి రాయికోడ్‌కు చెందిన దుంన్ది రాజ్ గణపతి ట్రేడర్ యజమాని రవీందర్ సౌండ్ సిస్టం అందజేశారు. ఎంప్లీఫైర్, రెండు మైకులు, మౌత్‌పీస్‌ను విరాళంగా ఇచ్చారు. ఆలయాభివృద్ధికి తనవంతుగా సౌండ్ సిస్టం అందజేసిన రవీందర్‌కు గొల్లకుర్మ సంఘ సభ్యులు శాలువాతో సన్మానించారు. ప్రతీ ఒక్కరు ఆలయాభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ఇందులో కుర్మ సంఘం అధ్యక్షులు భరత్, నాయకులు రవీందర్, కుర్మ సంఘ సభ్యులు బీరప్ప, కృష్ణ, చెన్నయ్య, మల్లేశం, రాజు, శ్రీనివాస్, లింగం తదితరులు పాల్గొన్నారు.

◆ బోరు బావుల కేబుల్ వైర్లు అపహరణ

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సీ లింగాపూర్‌కు చెందిన పది మంది రైతుల కరెంట్ కేబుల్ వైరును సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించుకపోయారు. ఉదయమే బోరు బావుల వద్దకు వచ్చిన రైతులు వైరు చోరీ అయినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. తమ బోరు మోటార్లకు సంబంధించి కేబుల్ వైర్లు అపహరణకు గురవడంతో తమ పంట పొలాలు ఎండుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.